# రాజనీతి



వెంకటాద్రి నాయనింగారు అమరావతిని రాజధానిగా చేసుకొని పరిపాలిస్తున్న కాలంలో ఒక చిత్రమైన సంఘటన జరిగింది. పరిపాలనా వ్యవహారాలను, ఉద్యోగులు చూస్తూ ఉన్నప్పటికీ, వారయినా తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నదీ లేనిదీ ప్రభువులకు తెలియడం చాలా అవసరమని, ముమ్మనాచార్యులవారు భావించారు. ఉద్యోగులెప్పుడూ ప్రభువులకు అనుకూలంగానే ఉంటారు. ప్రభువుల ఆదేశాలను పాటిస్తూనే ఉంటారు.

కానీ అన్ని వేళలా అలానే జరగకపోవచ్చు. ప్రభువుల ఆదేశాలను ఉద్యోగులు అమలు జరపక పోవచ్చు. ప్రజల బాధలను ప్రభువులు తెలుసుకోకుండా ఈ ఉద్యోగులు అడ్డుపడవచ్చు.

ఈ విషయాలన్నింటినీ ముమ్మనాచార్యులవారు ఒకటికి పది సార్లు ఆలోచించారు. ప్రజలకూ ప్రభులకూ దగ్గర సంబంధాలుండడం చాలా అవసరం! ప్రజల బాధలు రాజుగారికి తెలియాలి. రాజుగారి ధోరణిని ప్రజలు కూడా తెలుసుకోవడం అవసరం!

ఈ అభిప్రాయంతోనే ముమ్మనాచార్యులవారు, నాయనింగారిని కలిశారు.

కలుసుకొని ఏమన్నారంటే—

"మహాప్రభూ! మనం రాజధానీ నగరంలోనే, ఉండడంవల్ల ప్రయోజనం లేదు. అప్పుడప్పుడు మనమూ, సంచారం చేస్తూ ఉండాలి. రక రకాల ప్రజలనూ, కలుసుకొంటూ ఉండాలి. వారి సాధకబాధకాలనూ తెలుసుకుంటూ ఉండాలి. మన ఉద్యోగుల్ని మనమే అనుమానించడం కాదు గానీ, వారయినా రవంత జాగ్రత్తగా ఉండేందుకు ఇలాంటి పర్యటనలు సహాయపడతాయని నేను భావిస్తున్నాను. ఆపైన తమ దయ!" అన్నారు ముమ్మనాచార్యులవారు.

నాయనింగారు కూడా అందుకు అంగీకరించారు. ఒక శుభ ముహూర్తాన వెంకటాద్రి నాయనింగారూ, వారి అంతరంగిక సచివులైన ముమ్మనాచార్యులవారూ, అంగరక్షకులూ, ఇతర ఉద్యోగులూ, సంచారం బయలుదేరారు. ఈ విషయం ముందుగానే ఆయా ఉద్యోగులకూ తెలియచేయడమయింది. చాలా చోట్ల ప్రజలు నాయనింగారిని

స్వయంగా కలుసుకొని తమ కష్ట సుఖాలు చెప్పుకొన్నారు. కొన్నింటిని అక్కడికక్కడ అప్పటికప్పుడే పరిష్కారం చేశారు నాయనింగారు.

ఒక రోజు ఉదయమే ప్రభువులు సపరివారంగా మరో గ్రామానికి బయలు దేరారు.

మధ్యాహ్నమయింది.

గ్రామం కూతవేటు దూరంలో ఉన్నది. గ్రామాన్ని ఆనుకుని మామిడి తోపు. ప్రభువుల పల్లకి తోపు పొంతన ఉన్న దోవన వెడుతున్నది. మామిడి నీడలో ఓ రైతు వెల్లకిలా పడుకొని ఉన్నాడు. ప్రభువును చూసి కూడా అతను లేవలేదు.

నాయనింగారికి కోపం వచ్చింది. పల్లకీని ఆపించారు. సేవకుణ్ని పంపి రైతును పిలిపించారు. అతని చేతనే అడిగించారు. ప్రభువును చూసి ఎందుకు సేవించుకోలేదూ అని.

ఆ రైతు చిరునవ్వు నవ్వాడు.

నవ్వి -

"అయ్యా! నేను మీ సొమ్ము తినడంలేదు, మిమ్మల్ని సేవించుకోడానికి! రాజులు ప్రజా సేవకులు కావాలిగాని, ప్రజలు రాజు సేవకులు కాకూడదని నా అభిప్రాయం" అన్నాడా రైతు.

నాయనింగారు ఆ సత్యాన్ని శిరసా వహించారు

---o---